ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
సిద్దిపేట
గురువారం 11 సెప్టెంబరు 2025



పందిళ్లలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గౌరవెల్లి ప్రాజెక్టును

త్వరలోనే పూర్తి చేస్తాం

- అన్నిరంగాల్లో హుస్నాబాద్ అభివృద్ధికి కృషి
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం

హుస్నాబాద్‌రూరల్/కోహెడ సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందిస్తామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అన్ని రంగాల్లో హుస్నాబాద్ అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన తెలిపారు బుధవారం రాత్రి హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో, కోహెడ మండలం బస్వాపూర్, సముద్రాల గ్రామాల్లో హుస్నాబాద్-సిద్దిపేట జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను కలెక్టర్ కె.హైమావతితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడారు. నాలుగు జిల్లాల సరిహద్దులో ఉన్న హుస్నాబాద్‌ను పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా, విద్యాపరంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సిద్దిపేట జిల్లా నుంచి హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి వరకు జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన జిల్లెలగడ్డ, ముల్కనూర్, కొత్తపల్లి, ఎల్కతుర్తి గ్రామాల్లో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని స్పష్టం అలాగే కరీంనగర్-హుస్నాబాద్ నాలుగు లేన్ల రహదారిలో కూడా సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పూర్తి చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, బంక చందు, జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కోహెడ మండలం సముద్రాలలో వెలుగుతున్న సెంట్రల్ లైట్లు

మూగ జీవాలపై పట్టింపేది?

పడకేసిన పశువైద్యం



- ఏడాదిగా నిలిచిన మందుల సరఫరా
- వ్యాధుల బారిన పడుతున్న జీవాలు
- బయట మందులు కొనుగోలు చేస్తున్న రైతులు
- పశుపోషకులకు తప్పని ఇబ్బందులు

పల్లెల్లో పశువైద్యం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రభుత్వ పశువైద్య కేంద్రాలకు అవసరమైన మందులు ఏడాదిగా సరఫరా కాకపోవడంతో పశువైద్యం నామమాత్రంగా మారింది. ప్రధానంగా డీవార్మింగ్, యాంటీబయాటిక్స్ ఇతర అత్యవసర మందులు లేకపోవడంతో రైతులు, పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం జ్వరం వస్తే ఇచ్చే మందులు కూడా ఆసుపత్రుల్లో లభించకపోవడంతో రైతులు డబ్బులు వెచ్చించి బయట కొనుగోలు చేయాల్సి వస్తుంది.

- గజ్వేల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

2019 పశుగణన లెక్కల ప్రకారం జిల్లాలో ఆవులు, గేదెలు, కలిపి మూడు లక్షల వరకు ఉన్నాయి. గొర్రెలు, మేకలు దాదాపు పది లక్షలుగా పైగానే ఉన్నాయి. మూగ జీవాలు ఏదైనా వ్యాధులకు గురైతే ఆసుపత్రులకు వెళ్తే అవసరమైన మందులు దొరకడం లేదు. ముఖ్యంగా వాక్సినేషన్ మందులు మాత్రమే ఉన్నాయని, సూదిమందులు పదకొండు నెలలుగా అందుబాటులో లేవని రైతులు వాపోతున్నారు. ఆస్పత్రుల్లో పోస్టులు ఖాళీగా ఉండడంతో కంపౌండర్లు, అటెండర్లు, గోపాలమిత్రతో వైద్యాన్ని చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక 1962 సంచార పశువైద్యశాలల్లో సైతం మందులు అందుబాటులో ఉండడం లేదు. జిల్లా వ్యాప్తంగా పశువైద్యాధికారుల పనితీరుపై సమీక్ష జరపాలని, పశువులకు, జీవాలకు అందుతున్న వైద్యంపై ఆరా తీయాలని పశుపోషకులు, రైతులు కోరుతున్నారు.



జిల్లాలో పశుసంపద ఇలా...

2019 పశుగణన ప్రకారం జిల్లాలో దాదాపు 14 లక్షల వరకు పశుసంపద ఉన్నట్లుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఆవులు- 1,42705, ప్రస్తుతం 88,430, గేదెలు 2,05,357 ఉండగా, ప్రస్తుతం 1,08,088, గొర్రెలు 8,19,952 ఉండగా, ప్రస్తుతం 7,30,866, మేకలు 2,10,267 ఉండగా ప్రస్తుతం 1,66,589 ఉన్నాయి. గత లెక్కలతో పోలిస్తే ప్రస్తుతం పశు సంపద తగ్గింది.


సీజనల్ వ్యాధులతో సతమతం

వేలాది మంది పశుపోషకులకు ఉపాధినిచ్చే మూగజీవాలకు రాష్ట్రంలో ప్రమాదం పొంచి ఉంది. వర్షాకాలం కావడంతో పశువులకు ఆయా రకాల వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా గొర్రెలు, మేకల్లో నీటి నాలుక రోగం, మూతి వాపు, జొల్లు వాపు, కాలు గిట్టలలో పుండ్ల వ్యాధులు ప్రబలుతున్నాయి. కానీ వీటికి వేసేందుకు ప్రభుత్వ వైద్య శాలల్లో మందులు కరువయ్యాయి. కనీసం పుండ్లు అయితే వైద్యం చేయడానికి ఐయోడిన్, బ్యాండేజీ, దూది కూడా లేని పరిస్థితి తలెత్తింది. దీంతో చీటి రాసి ఇస్తే ప్రైవేటుకు వెళ్లి మందు బిల్లులు కొనాల్సి వస్తుంది. ఒక్కో ప్రిస్క్రిప్షన్‌కు రూ.1000 నుంచి రూ.2వేల వరకు ఖర్చు అవుతుంది. ఇంత ఖర్చు చేసినా ఆసుపత్రుల్లో అటెండర్లే వైద్యాన్ని అందిస్తున్నారు. కేవలం పీపీఆర్ వ్యాక్సిన్ మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. మిగిలిన మందులను బయటే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఖాళీ పోస్టుల ప్రభావం

జిల్లా వ్యాప్తంగా 199 పోస్టులకు 36 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారిక

మిగతా 8వ పేజీలో



టీవీఎస్‌ఎక్సెల్‌పై తోళ్లసేకరణకు వెళ్తున్న అమీర్‌అలీ

95 ఏళ్ల కుర్రాడు..

అమీర్ అలీ

- ఇప్పటికీ శ్రమజీవనమే.. ఆహార అలవాట్లే ఆరోగ్యం
- రోజూ ఐదు కిలోమీటర్ల నడక
- ఊర్లకు వెళ్లి మేక, గొర్రెల తోళ్ల సేకరణ
- వంద దాటిన కుటుంబ సభ్యులు

7

ఎన్‌సీసీ కేడెట్ల

స్పెషల్ అడ్వెంచర్ క్యాంప్

7

మోదీతోనే దేశం

బలంగా నిలబడింది

- ఎంపీ రఘునందన్‌రావు

7

ఏ గట్టునుంటారో..?

వీడని పది గ్రామాల పీటముడి

- తేలని అక్కన్నపేట విలీన సమస్య..
- రెండేళ్లుగా ఎదురుచూపు
- సమీపిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు
- అయినా.. కానరాని స్పష్టత
- అయోమయంలో ప్రజలు, ఆశావహులు



గోవర్ధనగిరి గ్రామపంచాయతీ కార్యాలయం

హుస్నాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌కు సమీపంలో ఉన్న పది గ్రామాల ప్రజలు రెండేళ్లుగా ఎదురుచూస్తున్న విలీన సమస్య.. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోసారి చర్చనీయాంశంగా మారింది. కొత్త ప్రభుత్వం వచ్చినా, పాత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో ఈ గ్రామాల ప్రజలు తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిదేళ్ల సమస్యకు పరిష్కారం ఏది?

జిల్లాల పునర్విభజన సమయంలో హుస్నాబాద్ మండలంలో ఉన్న 32 గ్రామపంచాయతీల నుంచి 19 గ్రామాలను తీసి 2016 నవంబరులో కొత్తగా అక్కన్నపేట మండలాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత తండాలను పంచాయతీలుగా మార్చడంతో మొత్తంగా అక్కన్నపేట మండలంలో 38 గ్రామపంచాయతీలయ్యాయి. ఈ మండలం ఏర్పాటు సమయంలో హుస్నాబాద్ మండల కేంద్రానికి కేవలం ఐదుకిలోమీటర్ల దూరంలో ఉన్న రేగొండ, గోవర్ధనగిరి, మల్చెర్వు తండా, బొడిగపల్లి, కేశవాపూర్, మంచినీళ్ల బండ, గౌరవెల్లి, గుడాటిపల్లి, జనగామ, గుబ్బడి గ్రామాలను అశాస్త్రీయంగా కొత్తగా ఏర్పడిన అక్కన్నపేట మండలంలో కలిపారు. అక్కడికి వెళ్లాలంటే హుస్నాబాద్ మీదుగా 25 కిలోమీటర్లు ప్రయాణించాలి. దీంతో ఈ ఎనిమిదేళ్లుగా ఈ గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని వారు ప్రజాప్రతినిధులు, అధికారులకు పదే పదే విన్నవించుకుంటున్నారు.

ప్రిలిమినరీ నోటిఫికేషన్ వచ్చినా...

గత ప్రభుత్వం, ప్రజల మొర ఆలకించి 20 మార్చి 2023న ఈ పది గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేయడానికి ఒక ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో, రెవెన్యూ అధికారులు తదుపరి చర్యల కోసం సీసీఎల్‌ఏకు పంపారు. అయితే, అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఈ విలీనం మధ్యలోనే ఆగిపోయింది. ప్రస్తుత రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఈ సమస్యపై సానుకూలంగా స్పందించి, విలీనం చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటికీ ఈ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ప్రజల్లో ఆవేదన నెలకొన్నది.

ఎన్నికల నేపథ్యంలో అయోమయం

ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో, ఈ పది గ్రామాల ప్రజలు తీవ్రమైన గందరగోళంలో ఉన్నారు. తాము ఏ మండలంలో భాగంగా ఎన్నికలలో పాల్గొనబోతున్నామో వారికి స్పష్టత లేదు. ఈ గ్రామాలు హుస్నాబాద్‌లో విలీనమైతే, రెండు మండలాల్లోనూ రిజర్వేషన్లు మారే అవకాశం ఉంది. దీంతో స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు కూడా తమ భవితవ్యం తేల్చుకోలేక అయోమయానికి గురవుతున్నారు.

ఎనిమిదేళ్లుగా తిరుగుతున్న..



హుస్నాబాద్‌కు కూత వేటు దూరంలో ఉన్న గోవర్ధనగిరి, రేగొండ, బొడిగపల్లితో పాటు మరో ఏడు గ్రామాలను అక్కన్న పేట మండలంలో కలపడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటిని హుస్నాబాద్ మండలంలో కలపాలని ఎనిమిదేళ్లుగా తిరుగుతున్నా. గత ప్రభుత్వ హయాంలో హుస్నాబాద్‌లో చేర్చాలని జీవో జారీ అయ్యింది. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకుని త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలి.

- పెండెల అయిలయ్య, మాజీ సర్పంచ్ గోవర్ధనగిరి

25 కిలోమీటర్ల వెళ్లాల్సి వస్తుంది



హుస్నాబాద్‌కు ఐదు కిలోమీటర్ల ఉన్న మా ఊరును 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న అక్కన్నపేటలో కలిపారు. పని మీద ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నం. ప్రభుత్వం స్పందించి రేగొండను హుస్నాబాద్‌లో విలీనం చేయాలి.

- రెండ్ల సంపత్, రేగొండ

గది లేక.. నిలిచిన అంబులెన్స్ సేవలు

- వారంలోనే గజ్వేల్‌కు తరలింపు
- అధికారుల తీరుపై స్థానిక ప్రజల ఆగ్రహం

కుకునూరుపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అత్యవసర సేవలందించాల్సిన అంబులెన్స్.. కేవలం సిబ్బందికి గది లేదనే చిన్న కారణంతో సేవలకు దూరమైంది. కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంజూరైన అంబులెన్స్‌ను వారంలోనే గజ్వేల్ పట్టణానికి తరలించడంతో ఇక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుకునూరుపల్లి మండలం ఏర్పాటు అయిన తర్వాత స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల విన్నపం మేరకు అంబులెన్స్ మంజూరైంది. కానీ సిబ్బంది ఉండటానికి గదులు లేకపోవడంతో, ప్రజల అవసరాలను పట్టించుకోకుండా వాహనాన్ని గజ్వేల్‌కు తరలించారు. నిత్యం ప్రమాదాలు జరిగే రాజీవ్ రహదారిపై కుకునూరుపల్లి, దాని చుట్టుపక్కల 20 గ్రామాలకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీయే దిక్కు. ఇక్కడ అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో, ఏదైనా ప్రమాదం జరిగినపుడు లేదా అత్యవసర పరిస్థితి తలెత్తినపుడు దుద్దెడ లేదా గజ్వేల్ నుంచి వాహనం రావడానికి కనీసం 40 నిమిషాలు పడుతోంది. ఈ జాప్యం వల్ల ఎంతో విలువైన సమయం వృథా అవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సిబ్బందికి గది ఏర్పాటు చేస్తే అంబులెన్స్ పంపిస్తాం..

సిబ్బందికి గది ఏర్పాటు చేస్తే అంబులెన్స్‌ను తిరిగి కుకునూరుపల్లికి పంపిస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్‌ను తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే గదుల ఏర్పాటు చేసి అంబులెన్స్ సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి భేష్

- ఇర్కోడు, కట్కూర్ గ్రామాలను సందర్శించిన ఉత్తరప్రదేశ్ బృందం



అక్కన్నపేట మండలం కట్కూర్‌లో ఉత్తరప్రదేశ్ బృందం సభ్యులు

సిద్దిపేటరూరల్/అక్కన్నపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధుల బృందం బుధవారం జిల్లాలోని ఇర్కోడు, కట్కూర్ గ్రామాలను సందర్శించింది. ఈ పర్యటనలో స్థానిక అభివృద్ధి పనులు, స్వయం సహాయక బృందాల పనితీరును అడిగి తెలుసుకుని అభివృద్ధి బేష్ అంటూ కితాబునిచ్చారు. సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడులోని స్వయం సహాయక సంఘాలు చేపట్టిన స్వయం ఉపాధి పనులైన పచ్చళ్ల తయారీని ఉత్తరప్రదేశ్ బృందం పరిశీలించింది. 2021-22లో 'ఉమెన్ ఫ్రెండ్లీ స్కీమ్' కింద చేపట్టిన కార్యక్రమాలను వారు ప్రశంసించారు. అలాగే, గ్రామ పంచాయతీ కార్యాలయం, మోడల్ స్కూల్‌తో పాటు ఇతర అభివృద్ధి పనులను కూడా బృందం సభ్యులు పరిశీలించారు. అలాగే అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన పారిశుధ్య నిర్వహణ వంటివాటిని బృందం పరిశీలించింది. గ్రామ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వారు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆయా ఆయా కార్యక్రమాల్లో సీఆర్డీ సీఈవో అనిల్ కుమార్, ఎంపీడీవోలు మురళీధర్ శర్మ, బానోతు జయరాం, ఎంపీవో విష్ణు, గుగులోతు మోహన్, పంచాయతీ కార్యదర్శి కిషన్ రావు, జీవన్ రెడ్డిఇతర అధికారులు పాల్గొన్నారు.



ఇర్కోడులో బృందంసభ్యులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

భూభారతి దరఖాస్తులు

త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ హైమావతి

కొండపాక, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం కింద వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం కొండపాక మండలంలోని సమీకృత కార్యాలయ సముదాయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న ఇళ్లు వేగంగా పూర్తయ్యేలా రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలని ఎంపీడీవోను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్యామ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పలువురు ఉన్నారు.



దరకాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి







భౌ..బోయ్

- కోమటి చెరువు వాకింగ్ ట్రాక్‌పై తిష్ట వేస్తున్న శునకాలు..

సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు వాకింగ్ ట్రాక్‌పై వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వచ్చే వారిని ఇవి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కోమటి చెరువు పరిసర ప్రాంతాల్లోని దుకాణాల వద్ద దొరికే ఆహార పదార్థాలను తింటూ శునకాలు వాకింగ్ ట్రాక్‌పైనే తిష్ట వేస్తున్నాయి. ముఖ్యంగా ఉదయం వాకింగ్‌కు వెళ్లేప్పుడు చేతిలో కర్ర లేదా రాయి పట్టుకుని వెళ్లాల్సి వస్తోందని వాకర్లు వాపోతున్నారు. సాయంత్రం వేళల్లో కుటుంబంతో కలిసి వచ్చే సందర్శకులు కుక్కల బెడదతో భయపడుతున్నారు. వీటి వల్ల ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్





సిద్దిపేటలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్

వీరనారికి ఘన నివాళి

- జిల్లావ్యాప్తంగా చాకలి ఐలమ్మ వర్ధంతి
- పలు సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళ్లు

8

కూలీ అదృశ్యం



విజయ్ (ఫైల్)

రామచంద్రాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): లేబర్ షెడ్ నుంచి బయటకు వెళ్లిన కూలీ అదృశ్యమైన ఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన విజయ్(45) అపర్ణ నిర్మాణ సంస్థలో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే లేబర్‌షెడ్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 7న కిరాణ సామాన్ల కొనుగోలు కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లి రెండు రోజులైనా తిరిగి రాలేదు. అతడి బంధువు ఒకరు కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తూప్రాన్‌లో కోర్టు ఎప్పుడు?

- పూర్తికాని ఐవోసీ భవనం
- ఎంపీడీఓ కార్యాలయం ఖాళీ చేసేదెప్పుడో..



తూప్రాన్‌లోని ఐవోసీ భవనం

తూప్రాన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు ఏర్పాటుకు మూడేళ్లు గడిచిపోతున్నా అడుగులు ముందుకు పడటంలేదు. ఇదిగో.. అదిగో అంటూ ప్రకటనతో కాలం గడిచిపోతుందే తప్పా ఏర్పాటు ముందుకు కదలలేదు. ఆరునెలలుగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ పనులు ఆ స్థాయిలో జరగడంలేదు. జిల్లాలో పునర్విభజనతో గజ్వేల్ నియోజకవర్గం (కోర్టు పరిధి)లో ఉన్న తూప్రాన్ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ మెదక్ జిల్లాలో చేర్చారు. జిల్లాల పునర్విభజనతో తూప్రాన్, అల్లాదుర్గంలలో కోర్టులు ఏర్పాటు చేయాలని 2022 మే 12న హైకోర్టు సూచించింది. తూప్రాన్, అల్లాదుర్గం లతో జూనియర్ సివిల్ జడ్జీల కోర్టులు ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇందుకు అవసరమైన వసతి భవనం కల్పించాలని సూచించారు.

మే 20న మెదక్ 8వ అదనపు డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి కే. మారుతీదేవి తూప్రాన్‌లో భవనాలు పరిశీలించారు. 2023 అక్టోబరులో 57 కోర్టులను మంజూరు చేయగా అందులో అల్లాదుర్గం కోర్టు ఏర్పాటు ఉన్నప్పటికీ తూప్రాన్‌లో ఏర్పాటుకు చోటు దక్కలేదు. కోర్టుల ఏర్పాటుకు భవనాలు చూపడంతో అల్లాదుర్గం, జిన్నారం, సిద్దిపేట కోర్టులు ఏర్పాటు చేశారు. తూప్రాన్ కోర్టు ఏర్పాటు అడుగులు ముందుకు పడటంలేదు.

నిలిచిపోయిన పనులు

తూప్రాన్ పట్టణానికి మంజూరైన జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు ఏర్పాటుకు భవనాల ఎంపికకే కాలం గడిచిపోతుంది. తూప్రాన్‌లో పలు భవనాలు చూసినప్పటికీ న్యాయాధికారులకు నచ్చకపోవడంతో చివరకు తూప్రాన్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎంపిక చేశారు. కోర్టుకు ఎంపీపీ కార్యాలయం ఎంపిక చేయగా ఎంపీపీ కార్యాలయాన్ని తూప్రాన్ పట్టణంలో వృధాగా ఉన్న వెజ్ నాన్‌వెజ్ మార్కెట్‌లోకి మార్చేందుకు నిర్ణయించారు. ఆ భవనంలో మార్పులు చేర్పులు చేసేందుకు ఖర్చు చేయడం వృధా భావించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచనలతో చివరకు అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐఓసీ)లోకి ఎంపీపీ కార్యాలయం మార్చాలని నిర్ణయించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాలతో ఐవోసీ భవనంలో పనులు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 15 నాటికి ఐవోసీలో మండల ప్రజా పరిషత్, తహశీల్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల గదులు పూర్తి చేయాలని నిర్ణయించారు. పనులను ఆగస్టు 10 తరువాత ప్రారంభించడంతో సెప్టెంబరు ఒకటి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సెప్టెంబరు ఒకటి దాటిపోయినా పనులు పూర్తి కాకపోగా, మరో కొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తుంది. 2026లో నైనా కోర్టు ఏర్పాటు చేస్తారా? అంటు పలువురు ప్రశ్నిస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి

- నర్సాపూర్‌లో విక్రయాలు

నర్సాపూర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ఎక్సైజ్ పరిధిలో గంజాయి విక్రయాలు గుట్టుచప్పుడుగా కాకుండా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో తరచూ గంజాయి పట్టుపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అక్రమార్కులు యువత, అడ్డాకూలీలు, పరిశ్రమల్లో పని చేసే కార్మికులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని తూప్రాన్, మనోరాబాద్ ప్రాంతాలలో పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతంలో ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు వస్తుంటారు. వారిని టార్గెట్ చేస్తూ కొందరు గంజాయి అక్రమంగా తరలించి అమ్ముతున్నట్లు సమాచారం. నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలోనూ చాపకింద నీరులా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసింది. పట్టణ సమీపంలోని అర్బన్‌పార్కు వద్ద గంజాయి అమ్ముతుండగా పట్టుకుని వారి వద్ద నుంచి 104 గ్రాముల గంజాయిని ఇటీవల స్వాధీనం చేసుకున్నారు. అర్బన్‌పార్కుకు సెలవుదినాలలో పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. అందులో యువతీయువకులే ఎక్కువగా ఉంటారు. పట్టణంలోని జగన్నాథరావుకాలనీలో ఓ ఇంట్లో అమ్మకానికి అక్రమంగా దాచిన 302 గ్రాముల గంజాయి ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. తాజాగా పట్టణంలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని సివిల్ పోలీసులు పట్టుకుని విచారించగా వారి వద్ద 60 గ్రాముల గంజాయి లభించింది. ఇలా పట్టుపడుతున్న సరుకు కొంతేనని, అందరి కళ్లు కప్పి గంజాయి విక్రయాలు సాగుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు అధికారులు స్పందించి నర్సాపూర్‌లో గంజాయి అమ్మకాలను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక దృష్టి పెట్టాం

నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గంజాయి విక్రయాలను పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాం. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహిస్తూ తరుచు తనిఖీలు కూడా నిర్వహిస్తున్నాం. ఎవరికైనా గంజాయి అమ్మకాలు సాగుతున్నట్లు సమాచారం ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. గంజాయిపై నిర్లక్ష్యం చేసేది లేదు.

- ఎక్సైజ్ సీఐ ముస్తాఫా

వైద్య పరీక్షలన్నీ ఇక్కడే జరగాలి: కలెక్టర్ రాహుల్‌రాజ్



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



తూప్రాన్ ఆసుపత్రిలో రోగి రిపోర్టు పరిశీలిస్తున్న కలెక్టర్

మెదక్ అర్బన్/తూప్రాన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలన్నీ ఆసుపత్రిలోనే జరగాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. రోగులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలన్నారు. బుధవారం తూప్రాన్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాహుల్‌రాజ్ తనిఖీ చేశారు. ఫార్మసీ గదికి వెళ్లి మందుల నిలువలు పరిశీలించారు. ఎన్ని నెలలకు మందుల సరఫరా జరుగుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. టీకాల గదిలోకి వెళ్లి ఫ్రీజ్‌లోని వాక్సిన్‌లను పరిశీలించారు. రోగులకు సేవలు అందజేస్తున్న వివిధ విభాగాల గదులను పరిశీలించారు.

చాకలి ఐలమ్మకు నివాళి

భూమికోసం భుక్తి కోసం తెలంగాణ సాయుధ పోటరాం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని రాహుల్‌రాజ్‌పేర్కొన్నారు. జిల్లా బీసీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి వేడుకలను కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా బోధన..

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా బోధన చేయాలని రాహుల్ రాజ్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని వెస్లీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్‌ఎం) జిల్లాస్థాయి మేళాను బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠ్యాంశాలు చక్కగా అర్థం కావడానికి బోధనోపకరణాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు.

రాష్ట్రస్థాయికి 8 ప్రాజెక్టులు ఎంపిక

జిల్లాస్థాయి మేళాలో 21 మండలాల స్థాయిలో మొత్తం 208 ప్రాజెక్టులు ప్రదర్శించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన 8 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవోలు ప్రతాప్ రెడ్డి, శంకర్, ఏఎస్‌వో నవీన్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాను ముందు వరుసలో నడిపించండి

- వర్టికల్ విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబర్చాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్టికల్ విభాగంలో ఉన్న అధికారులు, సిబ్బంది క్రమం తప్పకుండా నిబంధనలు పాటిస్తూ జిల్లాను ముందు వరుసలో నడిపించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతినెలా నిర్వహించే క్రైం రివ్యూ సమావేశంలో ఈ వర్టికల్ ప్రదర్శన ఆధారంగా సమీక్ష జరుగుతుందన్నారు. డయల్ 100 కాల్స్‌కు త్వరితగతిన స్పందించాలని, వీలైనంత తక్కువ సమయంలో నేర స్థలానికి చేరుకొని నేర తీవ్రతను తగ్గించాలి. బ్లూకోర్ట్, పెట్రోకార్ సిబ్బంది తమ ఏరియాలో గల నేరస్థులపై, అనుమానితులపై క్రమం తప్పకుండా నిఘా ఉంచాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఫీడ్ బ్యాక్, క్యూఆర్ కోడ్‌ను అందరికీ కనిపించే విధంగా ఉంచాలి. వివిధ కేసుల్లో నిర్ణీత గడువులోగా చార్జ్‌షీట్లను కోర్టులో సమర్పించాలన్నారు. అన్ని వర్టికల్ విభాగాల్లో మెరుగైన ప్రదర్శన కనబరచినప్పుడే జిల్లా ముందు వరుసలో వుంటుందని అన్నారు. వర్టికల్ విభాగంలో ప్రతిభ ఆధారంగా రివార్డులు అందిస్తామని ఎస్పీ పంకజ్ తెలిపారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



బాల సదనంలో పిల్లలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల సదనంలోని పిల్లల పట్ల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య సూచించారు. సంగారెడ్డిలోని బాల సదనం, భరోసా కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల సదనం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని అన్నారు. మంచి చదువులు చదివి ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయ పరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు అంబటి రాజు ఎంపిక



అంబటి రాజు గౌడ్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): డెహ్రాడూన్‌లో 2026 ఫిబ్రవరిలో జరగబోయే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కి సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లికి చెందిన అంబటి రాజు ఎంపికయ్యాడు. ఈనెల 9న హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో జరిగిన స్టేట్ లెవెల్ సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ జావెలిన్ త్రో ఈవెంట్ లో అంబటి రాజు గౌడ్ మొదటి స్థానంలో నిలిచాడు. ప్రస్తుతం అంబటి రాజు గౌడ్ వ్యవసాయశాఖలో పని చేస్తూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు వద్ద పిఏగా పని చేస్తున్నాడు.

ఆగిన బస్సు.. ప్రయాణికుల తిప్పలు



బస్సు ఆగిపోవడంతో రోడ్డుపైనే ప్రయాణికుల అవస్థలు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట డిపోకు చెందిన సూపర్ లగ్జరీ డీలక్స్ బస్సు బస్టాండ్ నుంచి బయలుదేరి అర కిలోమీటర్ వెళ్లగానే రోడ్డుపైనే క్లచ్ బాక్స్ పట్టుకొని ఆగిపోయింది. సిద్దిపేట బస్టాండ్ నుంచి సుమారు 50మంది ప్రయాణికులతో హైదరాబాద్ బయలుదేరిన బస్సు మార్గమధ్యంలో ఆగిపోవడంతో ప్రయాణికులు మరో బస్సు వచ్చేవరకు సుమారు 40 నిమిషాలు రోడ్డుపైన వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

టేక్మాల్ సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన టేక్మాల్ మండలంలోని వేంకటపూర్ గ్రామా శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన విరరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా బెస్తాన్నవరిపేట మండలం, బసన్నపల్లి గ్రామానికి చెందిన గోనే గాలయ్య(30) వెంకటపూర్ గ్రామానికి చేందిన దీక్షను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వినాయక చవితి పండగకు వెంకటపూర్ గ్రామానికి వచ్చారు. గాలయ్య సోమవారం రాత్రి బయటకు వెళ్లివస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని ఓ కాలువలో శవమై తేలాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

నిజాంపేట, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని కల్వకుంట గ్రామానికి చెందిన బత్తుల రేణుక (44) కూలి పని చేసుకుంటూ జీవిస్తుంది. అయితే నాలుగు సంవత్సరాల క్రితం కూతురు పెళ్లి సమయంలో చేసిన అప్పులు, సంసారం కుటుంబ పోషణ కోసం తెలిసిన వారి వద్ద అప్పు చేసింది. అప్పులు తీర్చే మార్గం లేక, కుటుంబ పోషణ, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందింది. బుధవారం గడ్డి మందు తాగగా చికిత్స కోసం గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. భర్త బత్తుల చంద్రం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

రూ. 99లకే చీర.. ఎగబడిన మహిళలు

తూప్రాన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో బుధవారం ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ ఆఫర్‌తో మహిళలు ఎగబడ్డారు. మాల్ ప్రారంభం పురస్కరించుకొని ఒక చీరను రూ. 99లకే అందజేస్తున్నట్లు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. దీంతో మహిళలు పెద్దఎత్తున షాపింగ్ మాల్‌కు తరలి వచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున రావడంతో షాపింగ్ మాల్ మహిళలతో నిండిపోయింది. కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. మహిళలు భారీగా రావడంతో దుకాణ యజమానులు కొంత సమయంలో మహిళలు లోపలికి రాకుండా నిర్వాహకులు తలుపులు వేశారు.



షాపింగ్ మాల్‌లో ఎగబడుతున్న మహిళలు

95 ఏళ్ల కుర్రాడు.. అమీర్ అలీ

జిల్లా స్పెషల్

- ఇప్పటికీ శ్రమజీవనమే..
- ఆహార అలవాట్లే ఆరోగ్యం
- రోజూ ఐదు కిలోమీటర్ల నడక
- ఊర్లకు వెళ్లి తోళ్ల సేకరణ
- వంద దాటిన కుటుంబ సభ్యులు




కొడుకులు, కోడళ్లతో అమీర్ అలీ (ఫైల్)



ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నా..: అమీర్ అలీ

జీవితంలో అనేక కష్టాలను, ఇబ్బందులను ఎదుర్కున్నా. తల్లిదండ్రులు కష్టాన్ని నేర్పించారు. వండిన భోజనాన్ని ఎనిమిది మంది పంచుకుని తినేవాళ్లం. రజాకార్ల కాలంలో అమ్మే మమ్మల్ని కాపాడుకుంది. గత్తర వస్తే పెద్ద మనుషులు ఊరుచుట్టూ గోతులు తీసి, ప్రాణమున్న పందులను పాతిపెట్టారు. మనుషులు చచ్చిపోతే ముట్టుకునేవారు కాదు. మేం ఊరు వదిలి బాయికాడ పురుగులు, పాముల మధ్య కాలం వెళ్లదీశాం. ఇప్పటి కరోనా కంటే అప్పటి పరిస్థితి భయంకరంగా ఉండేది. స్కైలాబ్ లాంటి విపత్తును చూశాను. ఎప్పటి నుంచో మక్కా దర్శించుకోవాలని ఉంది. ఈ నెల 25న మక్కా వెళ్లాలనుకుంటున్నా. నా మనవడిని తీసుకుని వెళ్తా.

దుబ్బాక, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆయన వయస్సు 90 పైమాటే. ఆధార్ కార్డులో పుట్టిన సంవత్సరం 1931గా నమోదై ఉంది. శతధిక వృద్ధుడని స్థానికులు, అప్పటి తరం వారు చెబుతుంటారు. నాటి గత్తర నుంచి నేటి కరోనా వరకు.. తెలంగాణ విమోచన పోరాటం నుంచి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు ఎన్నో ఉద్యమాలను చూసిన ఆయనకు అంతవయస్సు ఉన్నట్లు కనిపించదు. నవయువకుడిలా ఇప్పటికే తన వృత్తి చేసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. రోజూ ద్విచక్రవాహనంపై ఊర్లు తిరుగుతూ తన వ్యాపారం చేస్తారు. తన జీవన విధానమే తన ఆరోగ్యానికి కారణం అంటున్నారు సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన అమీర్ అలీ. తెలిసిన వారంతా ఆయనను తోళ్ల అమీర్ అలీ అని పిలుస్తారు. కుటుంబానికి అన్ని ఉన్నా.. ఆదరించే వారు ఉన్నా.. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు నేర్పిన వృత్తిని ఇంకా వదలకుండా చేస్తూ చివరి వరకు పని చేస్తూనే ఉంటానని అంటున్నారు ఆయన.



మక్క గట్క.. తైద అంబలి

దుబ్బాకకు చెందిన బాషామియా, భానుబీ దంపతులకు ఎనిమిది మంది సంతానంలో ఐదుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. వారిలో అమీర్ అలీ రెండో సంతానం. తండ్రి తోళ్లవ్యాపారం చేసి కుటుంబాన్ని పోషించేవాడు. కొన్నిసార్లు కూలి పనికి కూడా వెళ్లే వారు. తండ్రితో పాటే అమీర్ అలీ కూడా తోళ్ల వ్యాపారంలో మెళకువలు నేర్చుకున్నారు. ఆ సమయంలో తల్లిదండ్రులు చింతగింజలు నానపెట్టుకుని, వాటిని దంచి అంబలిగా చేసుకుని తాగేవారు. దొరికితే మక్క గట్క, తైద అంబలి, సామబువ్వ వండుకుని తినేవారు. అమీర్ అలీ ఇప్పటి అవే ఆహార అలవాట్లు కొనసాగిస్తున్నారు. అదే తన ఆరోగ్య రహస్యమని చెబుతారు. ఇంత వయసులోన రోజూ సుమారు 5 కిలోమీటర్లు నడుస్తారు. రోజూ ఐదుసార్లు నమాజ్ చదవడం, రాత్రి ఖురాన్ పఠనం తప్పనిసరి. ఉదయం 9గంటలలోపే భోజనం చేస్తారు. కాలానుగుణంగా వచ్చే పండ్లను తీసుకుంటారు.

వందమంది దాటిన కుటుంబం

ఆయన వందేళ్లకు చేరువలో ఉండగా, అమీర్ అలీ కుటుంబ సభ్యులు కూడా వంద మంది దాటారనే చెప్పాలి. ఆయనకు ఏడుగుకు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమార్తెలు, కొడుకులకు కలిపి 25 మంది మనుమళ్లు, మనుమరాళ్లు, వారికి 27 మంది సంతానం. ఐదో తరంలోనూ ఆరుగురు పిల్లలు ఉన్నారు. అమీర్ అలీ ఇలా ఐదు తరాలను చూశారు. పండుగల సందర్భంగా వీరిలో చాలా మంది వస్తుంటారు. మూడేళ్ల క్రితం భార్య ఖాజాబీ అనారోగ్యంతో చనిపోయారు.

వృత్తిని వదలని తాత..

కుమారులు, కూమార్తెలు బంధుగణం అంతా బాగా స్థిరపడినా అమీర్‌అలీ మాత్రం తల్లిదండ్రుల నుంచి నేర్చుకున్న తోళ్ల వ్యాపారం ఇప్పటికీ వదలలేదు. మేక, గొర్రె తోళ్లను సేకరించేందుకు ద్విచక్రవాహనంపై దుబ్బాక మండలంతోపాటు సిద్దిపేట, అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి, తొగుట, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాలకు వెళ్తారు. అక్కడి నుంచి తోళ్లను సేకరించి, వాటిని శుద్ధి చేసి ముషీరాబాద్‌లో విక్రయానికి పంపిస్తారు.



అరుణాచల్‌ప్రదేశ్ లోని ఎన్ఐఎంఏఎస్ వద్ద సిద్దిపేట ఎన్‌సీసీ కేడెట్లు

స్పెషల్ అడ్వెంచర్ క్యాంప్ పూర్తి చేసిన ఎన్‌సీసీ కేడెట్లు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్‌సీసీ కేడెట్లు మందుల సుష్మ , సంజీవ్, వంశీ స్పెషల్ అడ్వెంచర్ క్యాంపును దిగ్విజయంగా పూర్తి చేశారు. ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 4 వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లోని దిరాంగ్ టౌన్‌లో జరిగిన ఈ క్యాంప్‌లో వారు జిప్ లైన్, కృత్రిమ గోడ ఎక్కడం, ట్రెక్కింగ్, రోప్ అబ్‌స్టాకిల్స్ వంటి సాహస కృత్యాలను నేర్చుకున్నారు. ప్రతీ రోజు 24 కిలోమీటర్లు ట్రెక్కింగ్ సాధన చేసి, నాయకత్వ లక్షణాలు, ఫిట్‌నెస్ ప్రాముఖ్యత వంటి అంశాలు నేర్చుకున్నారు. ఎన్‌సీసీ కేడెట్లను, వారి కేర్ టేకర్ బి.కృష్ణయ్యను కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.సునీత బుధవారం అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాఅయోధ్యరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డా.గోపాల సుదర్శనం, మహిళా సాధికారత సెల్ సమన్వయకర్త గోపిరెడ్డి లీలావతి, సీనియర్ కేడెట్లు పాల్గొన్నారు.

వైద్యంలో రసాయన, జీవశాస్త్రాల పాత్రపై చర్చాగోష్ఠి

- పటాన్‌చెరు గీతంలో సెమినార్
- ముఖ్యఅతిథిగా ఫ్రాన్స్ ప్రొఫెసర్ రెనే గ్రీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఐసీటీ పూర్వ డైరెక్టర్

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో 'వైద్యానికి సంబంధించిన పదార్థాలు: రసాయన, జీవశాస్త్రాల పాత్ర' అనే అంశంపై బుధవారం చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫ్రాన్స్‌లోని రెన్నెస్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ రెనే గ్రీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పరిశోధనలో ఆవిష్కరణల ప్రాముఖ్యతను వివరించారు. బయోమెడికల్ పరిశోధనలో మానవ ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడే డీబీ18 అనే కొత్త నిరోధకం ఆవిష్కరణపై లోతైన సమాచారం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఐసీటీ మాజీ డైరెక్టర్ శ్రీవారి చంద్రశేఖర్, పై ల్యాబ్స్‌కు చెందిన డాక్టర్ ప్రథమ, సీసీఎంబీ శాస్త్రవేత్త లాబన్యామోయ్ కోల్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎ.కె.సాహూ తదితరులు ప్రసంగించారు. అనంతరం అతిథులు గీతంలోని అత్యాధునిక ప్రయోగశాలలను సందర్శించారు. ఈ సెమినార్‌లో దాదాపు 150 మంది విద్యార్థులు, 20 మంది పరిశోధనా స్కాలర్లు పాల్గొని శాస్త్రీయ పురోగతిపై అవగాహన పెంచుకున్నారు.

సిబ్బందికి తెలియకుండానే ట్రాన్స్‌ఫార్మర్లకు రైతుల మరమ్మతులు

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై డీఈ వివరణ

తూప్రాన్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా నీట మునిగిన ట్రాన్స్‌ఫార్మర్లను రైతులు స్వయంగా మరమ్మతు కేంద్రాలకు తరలిస్తున్నారని తూప్రాన్ విద్యుత్ డీఈ గరత్మంతురాజు తెలిపారు. ఈ విషయమై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ట్రబుల్ ఫార్మర్స్' శీర్షికన ప్రచురితమైన కథనం నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. భారీ వరదలతో వెల్దుర్తి, తూప్రాన్, శివ్వంపేట విభాగాల్లోని పలు గ్రామాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగి దెబ్బతిన్నాయని తెలిపారు. మరోవైపు దీనిపై రైతులు స్పందించి మాట్లాడుతూ స్థానిక విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ల విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి అప్పగిస్తేనే మరమ్మతులకు తీసుకువచ్చినట్లు తెలిపారు. అలాగే, తూప్రాన్ ప్రాంతంలో ఏ గ్రామం ముంపునకు గురికాలేదని, ట్రాన్స్‌ఫార్మర్లు మునిగే స్థాయిలో నీరు రాలేదని వారు చెప్పడం గమనార్హం.

'లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించొద్దు'

నారాయణఖేడ్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని మాజీ ఎంపీ సోయంబాబురావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించడాన్ని వ్యతిరేకిస్తూ నారాయణఖేడ్‌లో లంబాడాలు వినూత్న నిరసన తెలిపారు. స్థానిక మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలను గాడిదలపై ఉంచి ఊరేగించారు. అనంతరం వాటికి చెప్పులతో కొట్టి, దహనం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ మాట్లాడుతూ ఎస్టీ జాబితాలోని లంబాడాలను కాంగ్రెస్ నాయకులు కోర్టును ఆశ్రయించి జాబితాలో నుంచి తొలగింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి లంబాడాల పక్షాన పోరాడాలని కోరారు. నారాయణఖేడ్‌లో ఎస్టీసెల్ నాయకుడు రాజునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఖేడ్‌లో గాడిదలపై నాయకుల చిత్ర పటాలు ఉంచి నిరసన తెలుపుతున్న గిరిజనులు

తెల్లాపూర్ ఐటీ హబ్‌గా మారుతోంది

- మౌలిక వసతులతోనే అభివృద్ధి సాధ్యం
- ఎంపీ రఘునందన్‌రావు
- ఉస్మాన్‌నగర్, అమీన్‌పూర్‌లో రిజర్వాయర్లు ప్రారంభం



ఉస్మాన్‌నగర్‌లో రిజర్వాయర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

రామచంద్రాపురం/అమీన్‌పూర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని తెల్లాపూర్ ఐటీ హబ్‌గా మారుతోందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బుధవారం ఉస్మాన్‌నగర్‌లో రూ.33కోట్లతో నిర్మించిన రిజర్వాయర్‌ను ఎంపీ, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రారంభించారు. అలాగే అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బంధంకొమ్ము గ్రామంలో రూ.11.32 కోట్లతో నిర్మించిన మినీ రిజర్వాయర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ, పెరుగుతున్న కాలనీల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అక్రమ వెంచర్లలో ఇళ్లు కట్టుకోవద్దని ప్రజలకు సూచించారు. బిల్డర్లు రోడ్లపై చెత్త వేస్తే సహించేది లేదన్నారు. వేగంగా విస్తరిస్తున్న నగరంలో మౌలిక వసతుల కల్పనతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మున్సిపాలిటీలో నీటి ఎద్దడి లేకుండా ఐదు మినీ రిజర్వాయర్లు నిర్మించామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ (టెనా) అధ్యక్షుడు ఈశ్వరీగారి రమణపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉస్మాన్‌నగర్‌లో రిజర్వాయర్ ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి నీటి బిల్లుల డిమాండ్‌ను రమణ తీసుకువెళ్లారు. దీనితో ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే 'నువ్వే లీడర్‌వి, నాకెందుకు చెబుతున్నావు?.. నువ్వే పరిష్కరించుకో' అంటూ మండిపడ్డారు.

ప్రధాని మోదీతోనే దేశం బలంగా నిలబడింది

సిద్దిపేట క్రైం, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ప్రపంచ దేశాల మధ్య భారతదేశం బలంగా నిలబడిందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత్ భారత్'గా చూడాలన్నది మోదీ ఆకాంక్ష అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి 15 రోజులపాటు సేవా పక్ష కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్రం ఇచ్చిన యూరియాను రైతులకు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులు ఆందోళన చెందవద్దని, అందరికీ యూరియా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

'సస్యరక్షణపై అవగాహన పెంచుకోవాలి'

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు సమగ్ర సస్యరక్షణపై అవగాహన కలిగి ఉండాలని సీఐపీఎంసీ హైదరాబాద్ ఇన్‌చార్జి సునీత సూచించారు. చిన్నశంకరంపేటలోని రైతు వేదికలో రైతులకు పంటల దిగుబడి, శుద్ధి, పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు వరి పంట సాగు విధానం, దిగుబడి, తెగుళ్ల నివారణ పద్ధతులు వివరించారు. ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్‌లో సస్యరక్షణ పద్ధతులను ఎలా ఉపయోగించాలో చూపించారు. డ్రోన్ సహాయంతో మందుల పిచికారీపై ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వాసుదేవ్, ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయశంకర్, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ఏవో లక్ష్మిప్రవీణ్, ఏఈవోలు మధులిక, నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.



వరి పంట దిగుబడిపై అవగాహన కల్పిస్తున్న కేంద్ర వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఏడీఏ వాసుదేవ్



మెదక్ జిల్లా శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద అన్నదాతల క్యూ



వెల్దుర్తి మండలంలోని హస్తాల్‌పూర్‌లో..

ఎంతకష్టమొచ్చే..

- రైతులకు తప్పని యూరియా బాధలు
- పీఏసీఎస్‌లు, అగ్రోస్ కేంద్రాల వద్ద భారీ బారులు
- సహనం కోల్పోతున్న అన్నదాతలు
- మిరుదొడ్డిలో కుర్చీలు ధ్వంసం

న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో యూరియా కోసం అన్నదాతలు పడరానిపాట్లుపడుతున్నారు. పడిగాపులు కాయలేక సహనం కోల్పోయి ఆందోళనలు, దాడులకు దిగుతున్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో మంగళవారం అర్ధరాత్రి నుంచి యూరియా కోసం పడిగాపులు కాసినా ఒక్క బస్తా కూడా దొరకలేదని రైతులు మండిపడ్డారు. బుధవారం మిరుదొడ్డికి రెండు లారీల యూరియా రావడంతో టోకెన్ల కోసం రైతులు ఒక్కసారిగా రైతువేదిక లోపలికి దూసుకురావడంతో టోకెన్లను ఇవ్వకుండా సిబ్బంది చేతులెత్తేశారు. దీంతో రైతులు అక్కడి కుర్చీలను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు ప్రత్యేకబలగాలను రప్పించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తూప్రాన్, నిజాంపేట, శివ్వంపేట, కుకునూరుపల్లి, హవేళిఘణపూర్, వెల్దుర్తి, చిన్నశంకరంపేట, దౌల్తాబాద్‌లో రైతులు పెద్ద ఎత్తున బారులు తీరారు. కొన్ని చోట్ల తోపులాట జరిగింది. అక్కడక్కడ రైతులు నిరసన తెలిపారు.



మిరుదొడ్డి పీఏసీఎస్ కేంద్రం వద్ద..

న్యూస్ బాక్స్

బుగ్గ రాజేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.1,70 లక్షలు

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేటలోని బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.1 లక్షా 70 వేలు సమకూరినట్లు డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జింక జయంత్, చైర్మన్ కరుణాకర్, ఈవో శ్రీధర్‌రెడ్డి, పూజారి సీతారామశర్మ పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

కొండపాక, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండపాక శివారులో కొమురవెల్లి కమాన్ సమీపంలో రాజీవ్ రహదారిపై లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. లక్సెట్టిపేట నుంచి హైదరాబాద్‌కు మొక్కజొన్నల లోడ్‌తో వెళ్తున్న లారీ రాజీవ్ రహదారిపై బుధవారం ఉదయం అడవి పందులు ఒక్కసారిగా అడ్డు రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో లారీ అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తా పడింది.

బైక్ పైనుంచి పడి ఇద్దరికి గాయాలు

మద్దూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న డీసీఎంను తప్పించబోయి ప్రమాదవశాత్తు అదుపుతప్పి పడిపోవడంతో బైక్‌పైనున్న తండ్రి కుమారుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామ శివారులో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలం రాంపూర్ గ్రామానికి చెందిన బందారం పరమేశ్వర్ కుటుంబంతో చేర్యాల మండల కేంద్రంలో నివాసముంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం రాంపూర్‌కు ద్విచక్రవాహనంపై భార్య, పిల్లలతో బయలుదేరాడు. నర్సాయపల్లి శివారులో ఎదురుగా డీసీఎం రావడంతో రోడ్డు కిందికి దిగే యత్నంలో బైక్ అదుపు తప్పి పడిపోయారు. ఈ ఘటనలో పరమేశ్వర్‌తో పాటు కుమారుడు నియంత్‌కు గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో చేర్యాల ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి పరమేశ్వర్‌ను తరలించారు.

ఓటర్, పోలింగ్ స్టేషన్ల తుది జాబితా ప్రదర్శన

మద్దూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్దూరు, దూళిమిట్ట మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఓటరు, పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను బుధవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా మద్దూరు, దూలిమిట్ట ఎంపీడీవోలు రాంమోహన్, వీరరాజ్ మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిమిత్తం ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాలు ప్రదర్శించినట్లు తెలిపారు.

శంకర్‌కు దళితవీర్ అవార్డు

మిరుదొడ్డి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగుపల్లి గ్రామానికి చెందిన డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ దళిత వీర్ అవార్డును అందుకున్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఆంధ్రప్రదేశ్‌మాజీ మంత్రి మాణిక్యప్రసాద్ చేతుల మీదుగా గుంటూరులో అవార్డును అందుకున్నారు.

13న మెగా జాబ్ మేళా

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట నియోజకవర్గ నిరుద్యోగ యువతీ యువకులకోసం ఈ నెల 13న మెగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్టు బుధవారం మాజీమంత్రి హరీశ్‌రావు ఓ ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి నుంచి ఇంజనీర్ చదివిన యువతీ యువకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో 20 కంపెనీలు 40 మంది హెచ్ ఆర్ లు పాల్గొంటారు. ఆసక్తిగలవారు ఈ కరపత్రం లోని క్యూ ఆర్ కోడ్ లో రిజిస్టేషన్ కావాలని సూచించారు.

సీఎం విజయోత్సవ సభను అడ్డుకోవాలి

మిరుదొడ్డి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి విజయోత్సవ సభను ముదిరాజ్‌లు అడ్డుకోవాలని ముదిరాజ్ హక్కుల సాధనసమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లిలో ముదిరాజ్‌కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. ఈ నెల 15న చలో కామారెడ్డి పేరిట 'ముదిరాజ్‌లకు బీసీఏ వచ్చుడా... రేవంత్‌రెడ్డి సర్కారును దించుడా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు సుధాకర్, రాజు, నరేష్, తుమ్మల బాల్‌రాజు, రమేష్ తదితరులున్నారు.

కమ్యూనిటీ కోఆర్డినేటర్లు అంకితభావంతో పని చేయాలి

మద్దూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల సమాఖ్యలో పని చేస్తున్న కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ప్రాజెక్ట్ నిబంధనలకు అనుగుణంగా అంకిత భావంతో పని చేయాలని డీఆర్డీవో సుధీర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జాగృతి సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం ప్రకాశం అధ్యక్షతన నిర్వహించిన వీవోఏల సమీక్షా సమావేశంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసుదేవ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. బ్యాంకు రుణాలు, జీవనోపాధుల కల్పన, పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల సమాఖ్యలో పని చేస్తున్న సీసీలు క్లస్టర్ వారిగా పురోగతి సాధించడంతో పాటు అంకిత భావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య బాధ్యులు, ఏపీఎం, ఆడిటర్ ప్రసాద్, సీసీలు, వీవోఏలు, ఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



అక్కన్నపేటలో రజకసంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



చేర్యాలలో రజకసంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



హుస్నాబాద్‌లో జనజాగృతి కళాసమితి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు



దౌల్తాబాద్: ముబ్బారస్‌పూర్‌లో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు



జగదేవ్‌పూర్‌లో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

తెలంగాణ పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీరనారి

● జిల్లావ్యాప్తంగా చాకలి ఐలమ్మ వర్ధంతి ● పలు సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళ్లు

భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించిన చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని బుధవారం జిల్లావ్యాప్తంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని ప్రధాన కూడళ్లలో ఆయా సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఆమె త్యాగాలను గుర్తు చేస్తూ నేటి యువతరం నాటి పోరాట యోధుల చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

- న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

కస్తూర్బాలో అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మర్కుక్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేష్‌పల్లి, యూసఫ్‌ఖాన్‌పల్లి గంగాపూర్, శివారు వెంకటాపూర్ తదితర గ్రామాల్లో జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ బుధవారం పర్యటించి డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. అనంతరం మర్కుక్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల టాయిలెట్స్‌ని, విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని, తరగతి గదిలో విద్యార్థుల ప్రగతిని పరిశీలించి ఎస్‌వో భాగ్యలక్ష్మికి తగు సూచనలు చేశారు. వారితో పాటు మండల ప్రత్యేక అధికారి సాగర్, మండల తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీవో అశోక్‌కుమార్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న గరిమా అగ్రవాల్

గురువు స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు



చిన్నకోడూరులో ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంపీడీవో జనార్దన్, ఎంఈవో యాదవరెడ్డి తదితరులు

మద్దూరు/చేర్యాల/చిన్నకోడూరు/రాయపోల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో గురుపూజోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. దూళిమిట్ట మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి గురుపూజోత్సవ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. కృత్రిమ మేధ, డిజిటల్ బోధన గురువులకు ప్రత్యామ్నాయం కాదని సమాజంలో గురువు స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల సమష్టి కృషివల్లే తాను ఉత్తమ అవార్డు అందుకోగలిగానని గుర్తు చేశారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన చేర్యాల మండలంలోని నాగపురి జడ్పీఎస్ఎస్ ఉపాధ్యాయుడు అందె విజయ్‌కుమార్‌ను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. చిన్నకోడూరు ఎంపీడీవో కార్యాలయంలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జనార్దన్. ఎంఈవో యాదవరెడ్డి ఆధ్వర్యంలో 32 మంది మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి, మెమెంటోను అందజేశారు. రాయపోల్‌లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈవో సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు.ఆయా కార్యక్రమాల్లో స్థానిక మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



దాదాపు 48ఏళ్ల తర్వాత సమావేశమైన హుస్నాబాద్ జడ్పీహైస్కూల్ పూర్వ విద్యార్థులు

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎస్సెస్సీ 1976-77 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం స్థానిక లక్ష్మీగార్డెన్‌లో కలుసుకుని సందడి చేశారు. దాదాపు 48 ఏళ్ల సుదీర్ఘకాలం తర్వాత తిరిగి అందరూ ఒక్కచోట కలుసుకోవడంతో ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. గతస్మృతులను నెమరువేసుకుంటూ రోజంతా ఉల్లాసంగా గడిపారు. పూర్వవిద్యార్థులు మేరుగు నాగార్జున్, గంగం బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనానికి కవి రచయిత అన్నవరం దేవేందర్ అధ్యక్షత వహించారు. 2027లో చేపట్టబోయే గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని నిర్ణయించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, మృతి చెందిన తోటి స్నేహితులను గుర్తు చేసుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.

ఈ సమ్మేళనంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లింగాల సాయన్న, మాజీ సర్పంచులు బత్తిని సాయన్న, కైలాసం, రిటైర్డ్ ఎంపీడీవో నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, లైబ్రేరియన్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు మండలాలను కరీంనగర్ జిల్లాలో కలపాలి



అక్కన్నపేట మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

అక్కన్నపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాలను కరీంనగర్ జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ అక్కన్నపేట మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన 100 రోజుల లోపే ఈ మూడు మండలాలను కరీంనగర్ జిల్లాలో కలుపుతానని హామీ ఇచ్చినా, ఆ హామీని స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇందులో బీజేపీ మండల అధ్యక్షులు రామంచ మహేందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల అభివృద్ధికి కృషి

● సహకార సమాఖ్య ఎండీ సుబ్బారాయుడు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొర్రె, మేకల పెంపకదారుల అభివృద్ధికి సొసైటీ కృషి చేస్తుందని తెలంగాణ గొర్రె, మేకల పెంపకదారుల సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బారాయుడు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పీర్లపల్లిలో గొర్రె కాపరులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తిమ్మాపూర్, చాట్లపల్లి, పీర్లపల్లి గ్రామాల్లో 30 యూనిట్లు గొర్రెలు, మేకలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం గొర్రె కాపర్ల అభివృద్ధితో పాటు పెంపకం విధానం ఎలా ఉందో తెలుసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేడీ కొండల్‌రెడ్డి, ఏడీ రమేష్ బాబు, మండల వైద్యాధికారి శ్వేత, వినయ్, రమేష్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

హుస్నాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యువతను చిత్తు చేస్తున్న డ్రగ్స్, గంజాయి మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోరాడుదామని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగామ రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం హుస్నాబాద్‌లో ఏఐవైఎఫ్ కార్యకర్తల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పరిశ్రమలను తనిఖీ చేసి డగ్స్ దందా చేపడుతున్న పరిశ్రమలను మూసివేసి యజమాన్యాలపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా స్టాప్ డ్రగ్స్, స్టార్ ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు బండి అభిలాష్, సాయి, ముచ్చేంద్ర, చరణ్, రఘు, శ్రీను, కిరణ్ పాల్గొన్నారు.

మేళాలో ప్రతిభ కనబరిచిన టీచర్‌కు సన్మానం

చేర్యాల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళాలో తెలుగు విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానం కైవసంచేసుకున్న చేర్యాల మండలంలోని కొత్త దొమ్మాట ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయురాలు మమతతో పాటు గణితంలో మండలస్థాయి ప్రథమ స్థానం పొందిన కృష్ణమూర్తిని బుధవారం పాఠశాల హెచ్‌ఎం. పాశికంటి వెంకటరమణ, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్ఎం వీరస్వామి, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

ప్రతాప్‌రెడ్డిని పరామర్శించిన మెదక్ ఎంపీ



వజ్రమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, నాయకులు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాతృమూర్తి వజ్రమ్మ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. బుధవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, వంటేరు నరేందర్‌రెడ్డి తదితరులు ప్రతాపరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

● **సిద్దిపేట క్రైం:** బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ అన్న సుధాకర్ ఇటీవల మృతి చెందారు. దీంతో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు బుధవారం పార్టీ నాయకులతో కలిసి వెంకట్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎంపీ వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

పడకేసిన పశువైద్యం

(5వ పేజీ తరువాయి)

లెక్కలు చెబుతున్నాయి. 37మంది వెటర్నరీ సర్జన్లకు 30మంది మాత్రమే ఉన్నారు. వారిలో చాలా వరకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారే ఉన్నారు. వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ పోస్టులు రెండు ఖాళీగా ఉండగా, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పోస్టులు నాలుగు, వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు 13, వెటర్నరీ సూపరింటెండెంట్ పోస్టు ఒకటి, టైపిస్టు పోస్టు ఒకటి, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఏడు ఖాళీగా ఉన్నాయి.

కొంత మేర మందులు వచ్చాయి

జిల్లాకు కావాల్సిన మందులలో కొంత మేరకు మందులు రెండు రోజుల క్రితమే వచ్చాయి. వాటిని గ్రామాల్లోకి సరఫరా చేస్తున్నాం. మేజర్ మందులు వచ్చే నెలలో వస్తాయి. మందులు, ఖాళీల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికను పంపించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం. జిల్లాలో పశుసంపద పెంపునకు, పశువులు, జీవాలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడమే ప్రథమ కర్తవ్యం.

- డాక్టర్ కేఎన్. పూర్ణచందర్‌రావు, వెటర్నరీ జేడీ, సిద్దిపేట జిల్లా

ఉపాధ్యాయవృత్తి సామాజిక బాధ్యత: డీఈవో



విద్యార్థులకు స్పోర్ట్ డ్రెస్‌ను పంపిణీ చేస్తున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి సామాజిక బాధ్యతతో కూడినదని, వారిచేతులోనే సమాజం తీర్చిదిద్దబడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధ్యాయులు పేదవిద్యార్థుల పట్ల చూపుతున్న ఔదార్యం గొప్పదని ఆయన కొనియాడారు. బుధవారం దుబ్బాక మండలం తిమ్మాపూర్ జడ్పీ ఉన్నతపాఠశాలను ఆయన సందర్శించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు బోధన, వారి సామర్థ్యాలను పరిశీలించారు నాణ్యమైన గుణాత్మకమైన విద్యను అందించాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు నైపుణ్యమును పెంపొందించుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు పెంటయ్య సొంత ఖర్చులతో అందించిన స్పోర్ట్స్ దుస్తులను డీఈవో చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేవారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీకాంతరెడ్డి, మండల విద్యాధికారి ప్రభుదాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బండినర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో రాయపోల్ బాలికల జట్టుకు ప్రథమస్థానం



ఖోఖో పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన రాయపోల్ బాలికల జట్టు

రాయపోల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో సిద్దిపేటలో జిల్లా స్థాయి ఆటలపోటీలు నిర్వహించారు. మంగళవారం జరిగిన ఖోఖో ఫైనల్ పోటీల్లో ఖోఖో అండర్ 14 విభాగంలో రాయపోల్ బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అండర్ 17 విభాగంలో మూడో స్థానంలో నిలిచింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ఎంఈవో సత్యనారాయణరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

స్వయం సహాయక సంఘాలతో మహిళల అభివృద్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ జయదేవ్

వర్గల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధిని సాధిస్తున్నారని డీఆర్‌డీఏ జయదేవ్ పేర్కొన్నారు. బుధవారం వర్గల్‌లో ఇందిరా మహిళాశక్తి సంబరాల్లో భాగంగా నగదు రహిత లావాదేవిలపై వీవోఏ, సీసీలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగదు రహిత లావాదేవిలు, డిజిటల్ చెల్లింపులపై వివరించారు. కార్యక్రమంలో సెర్ప్ బ్యాంకు లింకేజీ ప్రాజెక్టు మేనేజర్ స్వామి, బ్యాంకు లింకేజీ జిల్లా అధికారి ప్రకాశ్, ఏపీఎం కిరణ్‌కుమార్, సీబీవో ఆడిటర్ బ్రహ్మచారి, కమ్యూనిటి కోఆర్డినేటర్‌లతో పాటు అన్ని గ్రామాల వీవోఏ, సీసీలు, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై గ్రామసభలో రభస



గ్రామసభలో మాట్లాడుతున్న మహిళలు

కుకునూరుపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో అవినీతి జరిగిందని గ్రామ మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్ చారి ఆరోపించారు. బుధవారం గ్రామపంచాయతీలో ఉపాధిహామీ పథకంపై సోషల్ ఆడిట్ నిర్వహించగా గ్రామ మాజీ సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడినట్టు ఆరోపించారు. హైదరాబాద్‌లో ఉన్న వారి అకౌంట్‌లో ఉపాధిహామీ నగదును జమ చేశారని, పనికి వెళ్లనివారి పేర్లు కూడా రిజిష్టర్‌లో నమోదు చేశారన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. దీనిపై అధికారులు కూడా స్పందించటం లేదని ఆరోపించారు. దీనిపై ఫీల్ అసిస్టెంట్ మాట్లాడుతూ ఉన్న రికార్స్ సక్రమంగానే ఉన్నాయని, పనికి వచ్చిన వారికే అకౌంట్‌లలో డబ్బులు జమ చేశామని తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



విద్యార్థులకు ఉచితంగా బుక్స్, ఎగ్జామ్ ప్యాడ్‌లను అందజేస్తున్న రియాజుద్దీన్

సిద్దిపేట సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని 20వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రియాజుద్దీన్ తెలిపారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని 21వ వార్డులో గల 6 నెంబర్ ఉర్దూ మీడియం పాఠశాలలో కౌన్సిలర్ రియాజుద్దీన్ విద్యార్థులకు బుక్స్, పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్‌లను ఉచితంగా అందజేశారు. మరో దాత సహకారంతో ప్రత్యేకంగా బాలికలకు స్కార్ఫ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ మీడియం పాఠశాలలో కిచెన్, టాయిలెట్‌ల నిర్మాణానికి నిధుల మంజూరు చేయిస్తానని హామీ నిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, జుబేర్ హుస్సేన్, అఖిల్, ముస్తాక్, బాబా, యూసఫ్, వెంగళ సుధీర్, మామిడాల ప్రవంతి, అశోక్, రబ్బాని పాల్గొన్నారు.

అంగడికిష్టాపూర్ బడిలో గ్రంథాలయం ఏర్పాటు



విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు అందజేస్తున్న టీవై రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్

మర్కుక్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అంగడికిష్టాపూర్‌లో టీవై రాజు ఫౌండేషన్ సౌజన్యంతో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్ అధ్యక్షతన గ్రంథాలయం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫౌండేషన్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలకు టీవై రాజు ఫౌండేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పాఠశాలకు బీరువా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ కమిటీ వైస్ చైర్మన్ కనకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.